ప్రజాశక్తి

శనివారం 01 జూన్ 2024 5 కర్నూలు

సంతకం చేస్తున్న డిఐజి విజయ రావు. పక్కన కలెక్టర్, ఎస్పీ

పచ్చిరొట్టలో కోత

- సగం మాత్రమే కేటాయింపు - నేటికీ ప్రారంభం కాని పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ప్రస్తుతం తొలకరి వర్షాలు కురుస్తున్నాయి. అన్నదాతలు సాగుకు సన్నద్ధమవుతు న్నారు. ఈ నేపథ్యంలో వారికి అవసరమైన విత్తనాలు సమకూర్చాల్సి ఉంది. భూసారం పెంచేలా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పచ్చి రొట్ట విత్తనాలను రాయితీపై అందించాల్సి ఉంది. ఇప్పటి వరకు పంపిణీ చేసేలా అధికారులు సన్నద్ధమవ్వలేదు. మరోవైపు కేటాయింపుల్లోనూ కోతలు విధించడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు...

కర్నూలు జిల్లాలో సాధారణ సాగు 4.19 లక్షలు, నంద్యాల జిల్లాలో 2.38 లక్షల హెక్టార్లుగా ఉంది. రైతులకు జీలుగ, పిల్లి పెసర విత్తనాలు 50 శాతం రాయితీపై పంపిణీకి చర్యలు చేపట్టారు. కర్నూలు జిల్లాకు 222 క్వింటాళ్లు, నంద్యాల జిల్లాకు 3,792 క్వింటాళ్లు కలిపి ఉమ్మడి జిల్లాకు 4,014 క్వింటాళ్ల పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు కేటాయించినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ ఉత్తర్వులు పంపింది. కర్నూలు జిల్లాలో 31.50 క్వింటాళ్ల జీలుగ, 3. 40 క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలు, నంద్యాల జిల్లాలో పిల్లిపెసర 6.48 క్వింటాళ్లు, జనుము 1,90, జీలుగ 2,565,70 క్వింటాళ్లు పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,617.36 క్వింటాళ్ల పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. వాస్తవానికి ఉమ్మడి జిల్లాకు రాష్ట్ర వ్యవసాయశాఖ 4,014 క్వింటాళ్ల పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు కేటాయించగా అందులో 1,396.64 క్వింటాళ్ల మేర జిల్లా వ్యవసాయశాఖ అధికారులు కోత విధించడం గమనార్హం. జీలుగ విత్తనాలు కిలో ధర రూ.88 ఉండగా రాయితీ పోనూ రూ.44, పిల్లి పెసర కిలో ధర రూ.134 ఉండగా రాయితీ పోను రైతులు రూ.67 చెల్లించాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో మే నెలలో సాధారణం కంటే వంద శాతం అధికంగా వర్షాలు కురిశాయి. వారంరోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభంకానుంది. ఈ అదునులో జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలు పంపిణీ చేయాల్సి ఉండగా అధికారులు నేటికీ ప్రారంభించలేదు. కర్నూలు జిల్లాలో ఎక్కువగా పత్తి, మిరప, వరి పంటలు సాగవుతాయి. ఖరీఫ్ సీజన్లో ముందుగా రైతులు తమ పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేస్తారు. ఆ పంటను తిరిగి దున్నితే నేల స్వభావం పెరిగి దిగుబడులు బాగుంటాయి. కానీ ఖరీఫ్‌పై వ్యవసాయశాఖ అధికారుల్లో సన్నద్ధత కొరవడింది. పంపిణీ చేసే విత్తనాలు అరకొరగా కేటాయించడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వం ఏటా వ్యవసాయ శాఖ ద్వారా ఖరీఫ్ సీజన్లో జీలుగ, జనుము, పిల్లి పెసర విత్తనాలను 50 శాతం రాయి తీపై రైతులకు పంపిణీ చేస్తుంది.. ప్రస్తుతం పరిశీలిస్తే ఉమ్మడి జిల్లాలో 26 మండలాలకు పచ్చిరొట్ట విత్తనాలు క్వింటా కూడా కేటాయించలేదు. తమకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయాలని ఆయా మండలాల్లో అన్నదాతలు విన్నవిస్తున్నా వ్యవసాయాధికారులు విత్తనాల ఊసే ఎత్తడం లేదు. బయట మార్కెట్లో పిల్లిపెసర క్వింటా రూ.13,400 ధర ఉంది. రైతులు బయట కొనుగోలు చేసి భూసారం పెంచుకోవాలంటే అదనపు భారం తప్పదు. ఈ నేపథ్యంలో అన్నదాతలకు అవసరమైన మేర విత్తనాలు అందించాల్సి ఉంది. కర్నూలు జిల్లాలో 26 మండలాల్లో వ్యవసాయ భూములు ఉన్నాయి. ఖరీఫ్ సాధారణ సాగు 4.20 లక్షల హెక్టార్లుగా ఉంది. జిల్లాలో ఐదు మండలాల్లో 31.5 క్వింటాళ్ల జీలుగ, 3.4 క్వింటాళ్ల పిల్లిపెసర అవసరమని మండల వ్యవసాయాధికారులు ప్రతిపాదనలు పంపగా 18 క్వింటాళ్ల పచ్చిరొట్ట, 1.36 క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలు కేటాయించారు. జనుము ఒక్క కిలో కూడా మంజూరు కాకపోవడం గమనార్హం. పచ్చిరొట్ట అరకొరగా కేటాయింపులు చేయడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నంద్యాల జిల్లాలో 29 మండలాలు ఉండగా అందులో 24 ప్రాంతాలకు 3,683.62 క్వింటాళ్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపారు. 2,565.70 క్వింటాళ్ల జీలుగ, నాలుగు మండలాలకు 15.50 క్వింటాళ్ల పిల్లి పెసర అవసరమని పేర్కొనగా కేవలం 6.48 క్వింటాళ్లు, సంజామల మండలానికి 4.00 క్వింటాళ్ల జనుము అవసరమని ప్రతిపాదనలు పంపగా 1.90 క్వింటాళ్లు మాత్రమే కేటాయించారు. నంద్యాలకు నాలుగు క్వింటాళ్ల పిల్లి పెసర అవసరమని ప్రతిపాదనలు పంపితే ఒక రైతుకు 40 కిలోలు, మహానందిలో 2.50 క్వింటాళ్ల పిల్లి పెసర అవసరమని ప్రతిపాదనలు పంపితే ఒకే ఒక్క రైతుకు 40 కేజీలు కేటాయించారు.

విత్తనాలు వేస్తున్న రైతు (ఫైల్)

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

- ఆర్‌యులో భద్రత ఏర్పాట్లను పరిశీలించిన డిఐజి, ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలులో సార్వత్రిక ఓట్ల లెక్కింపు సందర్భంగా శుక్రవారం కర్నూలు, బి. తాండ్రపాడు సమీపంలో ఉన్న కౌంటింగ్ కేంద్రమైన కర్నూలు రాయలసీమ యూనివర్సిటీలో కర్నూలు రేంజ్ డిఐజి సిహెచ్. విజయరావు, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన , జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్‌తో కలిసి భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. విజిటర్స్ రిజిస్టర్‌లో డిఐజి సంతకం చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన సిసి కెమెరాల కమాండ్ కంట్రోల్, కౌంటింగ్‌హాల్ ను , భద్రపరిచిన ఇవిఎంల స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. అనంతరం ఓట్ల లెక్కింపునకు తీసుకోవల్సిన భద్రత ఏర్పాట్ల గురించి కర్నూలు రేంజ్ డిఐజి కర్నూలు తాలుకా పోలీసుస్టేషన్‌లో పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం భద్రత ఏర్పాట్ల పై ఆరా తీసి, పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని పలు సూచనలు, సలహాలు చేసి దిశా, నిర్దేశం చేశారు. ట్రబుల్ మాంగర్స్ కు కౌన్సిలింగ్ చేయాలని, నిఘా ఉంచాలని, ఏజెంట్స్, అభ్యర్థులు చేయవలసినవి, చేయకూడని వాటి గురించి తెలియజేయాలన్నారు.

కౌంటింగ్ సెంటర్ వద్ద 144 సెక్షన్ అమలు

గుంపులు, గుంపులు గూమికూడి ఉండకుండా చర్యలు తీసుకోవాలని డిఐజి సూచించారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రం కు వచ్చే ప్రతి వ్యక్తిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. గుర్తింపు కార్డులను పరిశీలించిన తర్వాత మాత్రమే లోపలికి అనుమతించాలన్నారు. ఓట్ల లెక్కింపు రోజున అభ్యర్థులు , కౌంటింగ్ ఏజెంట్ల గుర్తింపు కార్డులను ఇచ్చే ధ్రువీకరణ పత్రాన్ని తనిఖీ చేసి పంపే విధంగా చర్యలు చేసుకోవాలన్నారు. కౌంటింగ్ సెంటర్ కి వచ్చే అభ్యర్థులు వారి ఏజెంట్లకు సంబంధించిన వాహనాలు వారికి నిర్దేశించిన పార్కింగ్ ప్రదేశంలో మాత్రమే పార్కింగ్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలి. జిల్లాలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల ఓట్ల లెక్కింపును దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని ట్రబుల్ మెంబర్స్, రౌడీషీటర్స్ , నేరచరిత్ర గల వారిపై నిఘా ఉంచి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కర్నూలు రేంజ్ డిఐజి తెలిపారు. డిఐజి వెంట అడిషనల్ ఎస్‌పిలు నాగరాజు, నాగబాబు, డిఎస్‌పిలు విజయశేఖర్, బాబు ప్రసాద్, సీతారామయ్య, శివ నారాయణస్వామి, శ్రీనివాసరెడ్డి, ట్రైని డిఎస్‌పి భావన, సిఐలు ఉన్నారు.

26 రౌండ్లలో పాణ్యం కౌంటింగ్

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి నారపరెడ్డి మౌర్య

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గం కౌంటింగ్ జూన్ 4న ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్, ఉదయం 8.30 గంటల నుండి ఇవిఎంల కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య వెల్లడించారు. ఈ నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్ 26 రౌండ్లల్లో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ... రాయలసీమ యూనివర్సి టీలోని మొదటి అంతస్తు ఇంజనీరింగ్ బ్లాక్‌లో నిర్వహిస్తామని తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్ కొరకు 14 టేబుల్స్ ని ఏర్పాటు చేశామన్నారు. అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 14 టేబుల్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. పోస్టల్ బ్యాలెట్ కు సంబంధించి దాదాపు 5700 పోస్టల్ బ్యాలెట్‌లను 6 టేబుల్స్ ద్వారా రెండు రౌండ్లలో లెక్కిస్తున్నామన్నారు. ప్రతి టేబుల్‌కు ఒక అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్‌ను కూడా ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ సిబ్బందికి కౌంటింగ్ పై ఇప్పటికే రెండు పర్యాయాలు శిక్షణ కూడా ఇచ్చామన్నా రు. కౌంటింగ్ సిబ్బంది ఏ టేబుల్ కు ఎవరిని కేటాయించామనే విషయం కౌంటింగ్ రోజు ఉదయమే ర్యాండమైజేషన్ ద్వారా తెలియజేస్తామన్నారు. కౌంటింగ్ కేంద్రం దగ్గర ఇవిఎంలకు సంబంధించిన బెల్ కంపెనీ ఇంజనీర్లు కూడా అందుబాటులో ఉంటారన్నారు. కౌంటింగ్ పూర్తి అయిన తర్వాత ఇవిఎం యంత్రాలను కలెక్టరేట్లోని ఇవిఎం గోడౌన్స్ కు చేరుస్తామన్నారు. కౌంటింగ్ రోజున కౌంటింగ్ సిబ్బంది, కౌంటింగ్ ఏజెంట్లు ఇతర ఎన్నికల సిబ్బంది ఖచ్చితంగా ఐడెంటి కార్డులు తీసుకుని రావాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బంది ఎవరు కూడా కౌంటింగ్ హాల్ లోనికి మొబైల్ ఫోన్స్ తీసుకు రావద్దన్నారు. ఒకవేళ తీసుకుని వస్తే వాటిని మొబైల్ డిపాజిట్ సెంటర్లో డిపాజిట్ చేసి కౌంటింగ్ హాల్ లోకి రావాల్సి ఉంటుందని జెసి తెలిపారు.

మీడియా సెంటర్‌ను పరిశీలించిన కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీలోని మీడియా సెంటర్, కమ్యూనికేషన్ సెంటర్‌లో ఏర్పాట్లను జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్ తో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కంట్రోల్ రూంలో స్ట్రాంగ్ రూమ్ లైవ్ ఫీడ్ ను పరిశీలించిన అనంతరం ఇవిఎం యంత్రాలను భద్రపరచిన ఇంజనీరింగ్ బ్లాక్‌ను, కౌంటింగ్ హాళ్లను పరిశీలించారు. మీడియా సెంటర్ లోని ఎల్ఇడి స్క్రీన్ లో స్ప్లిట్టర్ ఏర్పాటు చేసి అందులో 4 న్యూస్ ఛానల్స్, విడివిడిగా ఏర్పాటు చేసిన 4 టివిలలో 4 న్యూస్ ఛానల్స్ మొత్తం 8 న్యూస్ ఛానల్స్ వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మీడియా వారు కౌంటింగ్ హాల్‌లో విజువల్స్ తీసుకునేందుకు 5 నుండి 6 మందిని వాహనంలో తీసుకొని వెళ్ళే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మీడియా ప్రతినిధులకు మీడియా సెంటర్ వరకు మాత్రమే మొబైల్ ఫోన్ల అనుమతి ఉందన్నారు.

మీడియా సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన, ఎస్‌పి కృష్ణకాంత్

కౌంటింగ్ కేంద్రాల్లో
మొబైల్ ఫోన్లు నిషేధం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు నిషేధించామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో సాధారణ ఎన్నికలు-2024 కౌంటింగ్ నిర్వహణపై కౌంటింగ్ సూపర్వైజర్స్, కౌంటింగ్ అసిస్టెంట్స్‌కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4న కౌంటింగ్ ప్రక్రియలో ఇవిఎం కౌంటింగ్ ఒకటి, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఉంటాయన్నారు. జూన్ 2న ర్యాండమైజేషన్ ద్వారా పోస్టల్ బ్యాలెట్, ఇవిఎంలు లెక్కింపు ఎవరు చేస్తారు అనేది తెలిసే అవకాశం ఉంటుందన్నారు. జూన్ 3వ తేదిన కౌంటింగ్ సిబ్బంది మొత్తాన్ని రాయలసీమ యూనివర్సిటీలోని కౌంటింగ్ కేంద్రాలకు తీసుకొని వెళ్లి వారు కౌంటింగ్ విధులు నిర్వహించాల్సిన గదులను రిటర్నింగ్ అధికారులు చూపించడంతో పాటు అక్కడ ఏమైనా సందేహాలు ఉన్నా నివృత్తి చేయడం జరుగుతుందన్నారు. దీని ద్వారా 4వ తేది కౌంటింగ్ సిబ్బంది ఎటువంటి హడావిడి లేకుండా వారికి కేటాయించిన నియోజకవర్గాల కౌంటింగ్ హాళ్లలో విధులకు హాజరు అయ్యే అవకాశం ఉంటుందన్నారు. కౌంటింగ్ కేంద్రాలలో విధులు నిర్వహించే సిబ్బంది 4న ఉ.5.గం.లకు కలెక్టరేట్‌కు వస్తే అక్కడి నుండి వారిని బస్సుల ద్వారా కౌంటింగ్ కేంద్రాలకు తీసుకెళుతామన్నారు. లా అండ్ ఆర్డర్ దృష్ట్యా సొంత వాహనాలలో వచ్చి ఇబ్బంది పడకూడదని కలెక్టర్ కౌంటింగ్ సిబ్బందికి సూచించారు. ఇవిఎం కౌంటింగ్ సమయంలో సీల్స్ తొలగించేటప్పుడు అడ్రస్ ట్యాగ్ ద్వారం దగ్గర మాత్రమే కత్తిరించాలని, అదే విధంగా గ్రీన్ పేపర్ సీల్ మీద ఉన్న నెంబర్ కట్ చెయ్యకుండా జాగ్రత్తగా సీల్ తొలగించాలని, కౌంటింగ్ తరువాత మళ్లీ వాటితోనే సీల్ చేసే అవకాశం ఉంటుందన్నారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి తీసిన 17సి, కంట్రోల్ యూనిట్ మీద ఉన్న సీరియల్ నెంబర్ సరిచూసుకోవాలన్నారు. సదరు అడ్రస్ ట్యాగ్ మీద ఉన్న సీరియల్ నెంబర్, కంట్రోల్ యూనిట్ మీద ఉన్న నెంబర్ ఒక్కటే అనే డిక్లరేషన్ చేతితో రాసి ఏజెంట్లతో సంతకం తీసుకోవాలన్నారు. డిస్‌ప్లే లేని, ఇన్వాలిడ్ అని వచ్చిన ఇవిఎంలకు సంబంధించి వివిప్యాట్ స్లిప్స్ లెక్కిస్తామన్నారు. సదరు కౌంటింగ్‌లో వివిప్యాట్ స్లిప్స్ మాత్రమే ఫైనల్ గా పరిగణించబడుతుందన్నారు. తదుపరి పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఎలా చేయాలని మార్గ దర్శక సూత్రాలను కలెక్టర్ వివరించారు. డిఆర్ఒ మధుసూదన్ రావు, ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారులు సోమశేఖర్ రెడ్డి, మారుతి ప్రసాద్, సిద్ధలింగమూర్తి, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి సలీంబాషా, కౌంటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మైపర్ లో ఘనంగా జార్జి జయంతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని ఏ క్యాంపులోని మైపర్ ఫార్మసీ కళాశాలలో జార్జ్ విద్యాసంస్థల ఫౌండర్ జార్జి జయంతిని ఘనంగా నిర్వహించారు. సందర్భంగా వారి కుమారుడు ఆదిమూలపు సతీష్ , అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ స్టెల్లా సతీష్ , మైఫర్ ప్రిన్సిపల్ డాక్టర్ జె.రవి కుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ కాసర్ల సురేష్, ఎస్ఆర్‌సి ప్రిన్సిపల్ డాక్టర్ ప్రకాష్ ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యాసంస్థల కోసం జార్జి చేసిన కృషి, పట్టుదల గురించి నాణ్యమైన విద్యను అందించుటలో వారికృషిని ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా జార్జ్ సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.

జార్జి విగ్రహం వద్ద నివాళ్లు అర్పిస్తున్న డాక్టర్ సతీష్

ఆటోల వరుస దొంగతనాలను అరికట్టండి

పోలీస్ అధికారులకు సిఐటియు వినతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రతిరోజు ఎక్కడో ఒక చోట ఆటో దొంగతనాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఆటోల దొంగలను పట్టుకొని తగు చర్యలు తీసుకోవాలని ఎపి ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ అధికారులను కోరారు. సిఐటియు ఆటో కార్మిక సంఘంగా ఈరోజు ఒక ప్రకటన ద్వారా ఆటో కార్మిక సంఘం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షులు బి.రాధాకృష్ణ , ఎ.రవి ,కార్యదర్శులు మహమూద్ ,ఎస్.హుస్సేన్ వలీలు మాట్లాడుతూ ప్రతిరోజు నగరంలో ఎక్కడో ఒకచోట ఆటోలు దొంగతనాలు జరుగుతున్నా అధికారులు పట్టి పట్టనట్లు ఉన్నారని, గత మూడు నెలల క్రితం ఆటో కార్మిక సంఘం నాయకుని ఆటో పోతేనే ఇంతవరకు పోలీస్ అధికారులు పట్టించుకోలేదన్నారు. శుక్రవారం వీకర్ సెక్షన్ కాలనీ నివాసి షేక్ మహబూబ్ తన ఇంటి దగ్గర పెట్టుకున్న ఆటోను దొంగలు ఎత్తుకు పోయారని, ఆటో నడుపుకుంటేనే తప్ప పూట గడవని ఆటో కార్మికులు జీవనాధారమైన ఆటోలు పోవడం వల్ల అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. నగరంలో ఎక్కడ చూసినా ఆటోల దొంగలు హాస్పిటల్లో, సినిమా థియేటర్లలో ప్రైవేట్ హాస్పిటల్ ముందు పెట్టిన ఆటోలు ఎత్తుకుపోతున్నారని, పోలీస్ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. ఆటోలు పోవడం వల్ల ఫైనాన్స్ కంతులు చెల్లించలేక కుటుంబాలు గడవక కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. అధికారులు తక్షణమే జోక్యం చేసుకొని ఆటోల దొంగలను పట్టుకుని ఆటోలు రికవరీ చేసి యజమానులకు అప్పగించాలని అధికారులకు విన్నవించారు.

ఎపి21వై 0420 నెంబర్ గల ఆటో చోరీ

కర్నూలు వీకర్ సెక్షన్ కాలనీ షేక్ మహబూబ్‌కు చెందిన ఎపి21వై 0420 నంబర్ గల ఆటో గురువారం రాత్రి తన ఇంటి దగ్గర పెట్టుకున్న ఆటోను దొంగలు ఎత్తుకెళ్లారు. పై నంబర్ గల ఆటో ఎక్కడన్నా కనిపిస్తే ఆటో యూనియన్ సిఐటియు నాయకులకు తెలియజేయాలని , పట్టణ పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలన్నారు.

నేల విడిచి సాముచేస్తున్న ఇంజనీర్లు

మొక్కలకు నేలకు మధ్య సిమెంటు రోడ్డు -రూ.కోట్ల ప్రజాధనం వృథా

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఆర్అండ్‌బి రోడ్డుపై కిమీకు కోటి ఖర్చుతో అవసరంలేని ట్రాఫిక్ డివైడర్స్ కోసం ఆర్‌సిసిరోడ్డు దానిపై ఆర్‌సిసి గోడలు నిర్మిస్తూ కాంట్రాక్టర్ ఇంజనీర్లు కుమ్మక్కై, నాసిరకం రోడ్డు, మొక్కల కోసం వేసిన పనికిరాని మట్టి వేశారని కాంట్రాక్టర్ ఇంజనీర్లపై విచారణ జరిపించాలని పట్టణ పౌరసంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. వై.జంక్షన్ నుండి పెద్దపాడు వరకు జరుగుతున్న ఆర్అండ్‌బి రోడ్డు విస్తరణ పనులను, రోడ్డు మధ్యలో వేస్తున్న ఆర్‌సిసి ట్రాఫిక్ డివైడర్, మొక్కలు నాటేందుకు అందులో వేసిన పనికిరాని మట్టిని పరిశీలిస్తే ఇంజనీర్లు నేల విడిచి సాము చేస్తున్న చందంగా ఉందని పట్టణ పౌర సంక్షేమ సంఘం(పిపిఎస్ఎస్)నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, పి.ఇక్బాల్, బి సుకుమార్ విమర్శించారు. శుక్రవారం పిపిఎస్ఎస్ ప్రతినిధి బృందం వై.జంక్షన్ నుండి పెద్దపాడు వరకు పర్యటించారు. రోడ్డు విస్తరణ పనులను, ట్రాఫిక్ డివైడరును అందులో వేసిన మట్టిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణం పూర్తి కాకముందే కొన్ని ప్రాంతాల్లో వేసిన తారు రోడ్డు తక్కువ మందంతో వేయడం వల్ల కంకర లేచిపోయి చిన్న గుంతలు పడ్డాయని అన్నారు.రోడ్డు డివైడర్, అందులో మట్టి వేసి మొక్కలు నాటేందుకు కిలోమీటర్ కు దాదాపు రూ.కోటి వెచ్చిస్తున్నట్లు తెలిసింది. రోడ్డు మధ్యలో నిర్మిస్తున్న ఆర్‌సిసి ట్రాఫిక్ డివైడర్ పై వేస్తున్న మొక్కలకు నేలతో సంబంధం లేకుండా నిర్మిస్తున్నారని అన్నారు. రోడ్డు మధ్యలో 3-4 అడుగుల స్థలం వదిలేసి రోడ్లు నిర్మించాలని, ఆ స్థలంలో ట్రాఫిక్ డివైడర్ నిర్మించి మధ్యలో మట్టి వేసి చెట్లు నాటితే నేలకు మొక్కకు సంబంధం ఉంటుందన్నారను. కానీ ఎప్పటినుండో ఉన్న రోడ్డుపై మళ్లీ తారు రోడ్డు వేసి ఆతారు రోడ్డుపై సిమెంట్ రోడ్డు వేసి దానిపై యూసేప్‌లో ఆర్‌సిసి డివైడర్ నిర్మించిచారన్నారు. ఇందులో మొక్కలు పెంచేందుకు మెత్తని ఎర్ర మట్టి, నల్ల మట్టి వేయాలని, స్మశానంలో వేసేందుకు కూడా పనికిరాని మట్టిని వేసి దానిపై గుంతలో వేసే రాళ్లతో నిండిన ఎర్ర మురుసును వేశారన్నారు. ఈ మట్టి అంతా కూడా మొక్కలు పెరిగేందుకు పనికిరాదన్నారు. ఈ నిర్మాణాలను మొత్తం పరిశీలిస్తే సంబంధిత ఇంజనీరు కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై నాసిరకం పనులు చేయిస్తున్నారని అర్థమైందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపి సంబంధిత ఇంజనీరు, కాంట్రాక్టర్ పై చర్య తీసుకుని ప్రజాధనాన్ని కాపాడాలని కోరారు. ఈ ప్రతినిధి బృందంలో నగర నాయకులు సివివర్మ, శశి కుమార్ రెడ్డి, పీటర్, వెంకట్ రెడ్డి, నాగేశ్వరరావు, సూరిబాబు, యూనస్ తదితరులు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న పిపిఎస్ఎస్ రాష్ట్ర నాయకులు పుల్లారెడ్డి, బృందం

సీనియారిటీ జాబితాలోని లోపాలను సవరించాలి

జిల్లా విద్యాశాఖ అధికారులకు ఎపిఎంటిఎఫ్ వినతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పురపాలక ఉపాధ్యాయుల తాత్కాలిక సీనియారిటీ జాబితాలో లోపాలను సవరించాలని విద్యాశాఖ అధికారులకు శుక్రవారం ఎపిఎంటిఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అభ్యంతరాల గడువు నేటితో ముగిసింది. గడువులోగా అనేకమంది మున్సిపల్ ఉపాధ్యాయులు తమ అభ్యంతరాలను డిఇఒ కార్యాలయంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయ సమాఖ్య (ఎపిఎంటిఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి వి.సురేష్ కుమార్ ఆధ్వర్యంలో కర్నూలు, నంద్యాల , ఆదోని పురపాలక సంఘాలకు సంబంధించిన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పుల్లయ్య, నాయక్, రవితేజ, అనిల్ కుమార్, బసవరాజు , ఇతర కార్యవర్గ సభ్యులు శుక్రవారం విద్యాశాఖ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ (సహాయ సంచాలకులు) వి.శ్రీనివాసులుకు అభ్యంతరాలను తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 84లో తెలియజేసిన విధంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సీనియారిటీ జాబితాలను తయారు చేయాలన్నారు. భవిష్యత్తులో ఈ సీనియారిటీ జాబితాలలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే నంద్యాల నుండి , ఆదోని నుండి జిల్లా కేంద్రానికి వచ్చి అభ్యంతరాలు తెలిపే బదులు ఆయా మున్సిపాలిటీ పరిధిలోని మండల విద్యాధికారులకు అభ్యంతరాలు ఇచ్చే విధంగా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు టి. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కోర్టు ఆదేశాల మేరకు లాంగ్వేజ్ పండిట్స్‌కు, ఖాళీగా ఉన్న ఇతర కేటగిరీలకు , పాఠశాల సహాయకుల పోస్టులకు పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్ రావు, రవితేజ, మహేంద్ర రెడ్డి, పుల్లయ్య, నాయక్, మునీర్ బాబు, నాగేశ్వర నాయుడు, నాగ వెంకటేశ్వర్లు, బందెల వెంకటేశ్వర్లు,తోహిద్ భాను, బాలస్వామి, బత్తుల ఈశ్వర్ రెడ్డి, ముంతాజ్ బేగం, స్వాతి రెడ్డి, కవిత దేవి, పద్మావతి పాల్గొన్నారు.

విద్యాశాఖ అధికారికి వినతిపత్రం ఇస్తున్న టీచర్లు

సవరణ

ఈనెల 31న ప్రచురితమైన ఎన్నికల అధికారి, కలెక్టర్‌డాక్టర్ జి.సృజన విలేకరుల సమాశంలో చెప్పిన వార్తాంశాన్ని జూన్ 4న ఉదయం 8 గంటలకు ఇవిఎంల ఓట్ల లెక్కింపు అనే దానికి బదులుగా **'మూడున్నర గంటలకు ఇవిఎంల ఓట్ల లెక్కింపు'** అని హెడ్డింగులోనూ, సబ్ హెడ్డింగులో **' సాయంత్రం ఐదు నుండి పాణ్యం ఓట్ల లెక్కింపు'** అని పొరపాటుగా వచ్చినందుకు చింతిస్తున్నాం. మేటర్‌లోనూ అలాగే వచ్చింది. ఉదయం 8 గంటల నుంచే ఇవిఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని పరిగణించాలని కోరుతున్నాం. - **ఎడిటర్**

ఎస్ఆర్ కళాశాల గుర్తింపు రద్దు చేయాలి: ఎస్ఎఫ్ ఐ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూల్ నగరంలో విద్యానగర్‌లో ఎస్ఆర్ జూనియర్ కళాశాల గుర్తింపు రద్దుచేసి కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్ఐవోను వారు కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగప్ప అబ్దుల్లా మాట్లాడుతూ ఎస్ఆర్ కళాశాల పేరుతో విద్యానగర్‌లో ఉన్న కళాశాలలో ఏ రకమైన మౌలిక వసతులు లేకపోయినా కాలేజీ గుర్తింపునకు ఉండాల్సిన ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించలేదని పేర్కొన్నారు. కాలేజీకి అనుమతి ఉందని విచ్చలవిడిగా ప్రభుత్వ నియమ నిబంధనలను తుంగలో తొక్కుతున్నా ఆర్ఐఒ అధికారులు అక్కడికి వెళ్లి పరిశీలించిన దాఖలాలు లేవన్నారు. అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఎలాంటి నిబంధనలను పాటించకపోయినా ఆర్ఐఒ మాత్రం ఏ విధంగా నివేదికలు బోర్డు ఉన్నత అధికారులకు పంపారో అర్థమవుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుండి ఇప్పటికే కళాశాల యాజమాన్యం పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేసి అడ్మిషన్లు కూడా చేసుకున్నారన్నారు. వెంటనే కళాశాల గుర్తింపును రద్దు చేసి అడ్మిషన్లను నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు.

జిజిహెచ్ సూపరిన్‌టెండెంటుగా డాక్టర్ సి ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నూతన సూపరింటెండెంట్‌గా డాక్టర్ చింత ప్రభాకర్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సి ప్రభాకర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ నూతన సూపరింటెం డెంట్‌గా బాధ్యలు స్వీకరించినట్లు తెలిపారు. ఆసుపత్రిని ప్రక్షాళన చేస్తానని తెలిపారు. ఆసుపత్రిలో సమస్యలు ఉన్న వాటిపై ప్రత్యేక దృష్టి పెడతానని తెలిపారు. సెక్యూరిటీ,శానిటేషన్, పేస్ట్ కంట్రోల్, పై ప్రత్యేక దృష్టి పెడతానని తెలిపారు. అయితే సి ప్రభాకర్‌రెడ్డి కార్డియోథొరాసిక్ విభాగాధిపతిగాను, డిప్యూటి సూపరిన్‌టెండెంట్‌గాను అందరికి పరిచయమే. ఆయన విస్తృంగా గుండే, ఊపిరితిత్తుల ఆపరేషన్లను ప్రభుత్వ ఆస్పత్రిలోనే చేసి రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందారు. కార్యక్రమంలో కర్నూలు వైద్య కళాశాల అడిషనల్ డిఎఇ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, వెంకటరంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ వెంకటరంగారెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న గౌస్‌దేశాయ్

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

- రైతు ఆత్మహత్యలకు ప్రభుత్వాలదే బాధ్యత
- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

ప్రజాశక్తి - దేవనకొండ

అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడిన జిల్లేడుబుడకల గ్రామానికి చెందిన రైతు బోయ హరిశ్చంద్ర కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. కుటుంబ పెద్ద ఆత్మహత్యతో వీధిన పడిన కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. శుక్రవారం మండలంలోని జిల్లేడుబుడకల గ్రామంలో ఆత్మహత్యకు పాల్పడిన రైతు హరిశ్చంద్ర కుటుంబాన్ని సిపిఎం బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా గౌస్ దేశాయ్, జిల్లా నాయకులు వీరశేఖర్‌తో కూడిన సిపిఎం బృందం రైతు కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా సిపిఎం ఒత్తిడి తెస్తుందని తెలిపారు. మండలంలో గత రెండేళ్లుగా కరువు నెలకొందని చెప్పారు. పెట్టిన పెట్టుబడులు కూడా రాక, తెచ్చిన దగ్గర అప్పులు పెరిగి, అప్పులు కట్టలేక ఆత్మగౌరవంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కనీస మద్దతు ధర లేకపోవడం నానాటికీ పెరిగిపోతున్న ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల ధరలు రైతులను కుంగదీస్తున్నాయని తెలిపారు. రైతులు పండించే పంటకు నేటికీ గిట్టుబాటు ధర లేకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. కనీస మద్దతు ధర చట్టం తీసుకురావాలని, ఎరువులపై ఎత్తివేసిన సబ్సిడీని వెంటనే కొనసాగించే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు మనోధార్యాన్ని కోల్పోకుండా ప్రభుత్వపు దుర్మార్గ చర్యలకు వ్యతిరేకంగా పోరాడాలని తెలిపారు. సమస్యలకు పరిష్కారం ఆత్మహత్యలు కాదని పేర్కొన్నారు. గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతు ఆత్మహత్యలకు ప్రధాన కారణం అవుతున్నాయని తెలిపారు. రైతు హరిశ్చంద్ర రూ.12 లక్షల మేర అప్పులు చేశారని, ఇప్పటికే ఉన్న పొలంలో రెండెకరాలు అమ్మేశారని తెలిపారు. అప్పులు తీరే దారి లేక అఘాయిత్యానికి పాల్పడ్డారని పేర్కొన్నారు. వెంటనే బాధిత రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. మృతుని కుమారుడు, కుమార్తె చదువులకు ప్రభుత్వం పూర్తి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు అశోక్, సూరి, వీరేంద్ర, హరిశ్చంద్ర కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐ ప్రసాద్

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- సిఐ ప్రసాద్

ప్రజాశక్తి - కౌతాళం

సార్వత్రిక ఎన్నికల ఫలితాల రోజున, తర్వాతి రోజున శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ ప్రసాద్, ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి హెచ్చరించారు. ఎస్పీ కృష్ణకాంత్, ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో మండలంలోని వివిధ గ్రామాల్లోని అన్ని రాజకీయ పార్టీల నాయకులకుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజా తీర్పును అన్ని రాజకీయ పార్టీలు గౌరవించాలని కోరారు. అలా కాకుండా గొడవలు చేయడం, ప్రోత్సహించడం చేసి ప్రజాశాంతికి భంగం కలిగించే విధంగా ప్రవర్తించిస్తే కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా కాల్చడం నిషేధమని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు ఎటువంటి ఆటంకం కలిగించకూడదని, ఈనెల 6 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని తెలిపారు. 144 సిఆర్‌పిసి, 30 పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని చెప్పారు. సోషల్ మీడియా గ్రూపుల్లో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదని తెలిపారు. అలా చేస్తే వారిపై చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వివిధ రాజకీయ పార్టీ నాయకులు అందరూ సహకరించాలని కోరారు.

అమ్మో.. జూన్..!

- అటు వ్యవసాయానికి.. ఇటు విద్యకు డబ్బులు పెట్టాల్సిందే...
- బెంబేలెత్తుతున్న పేద, మధ్య తరగతి కుటుంబాలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ఖర్చుల గుబులు నెలకొంది. 11 నెలల పాటు ఏదో ఒక విధంగా నెట్టుకొచ్చిన పేద, మధ్యతరగతి కుటుంబాలు జూన్ వచ్చిందంటేనే భయపడిపోతున్నారు. 'అమ్మో.. జూన్' అంటూ నోరెళ్లబెడుతున్నారు. నెలరోజులపాటు వేసవి సెలవుల్లో ఆటపాటలతో ఆనందంగా గడిపిన విద్యార్థులు పుస్తకాలపై కుస్తీ పట్టేందుకు సిద్ధమవుతుండగా, మరో పక్క ఖరీఫ్ సీజన్ మొదలయ్యేది కూడా ఇదే నెల కావడంతో పేద, మధ్య తరగతి కుటుంబాల్లో అప్పులు చేయక తప్పదని కుటుంబ పెద్దలు వాపోతున్నారు.

జూన్ నెల వచ్చిందంటే సామాన్యులకు దడ మొదలైనట్లే. స్కూళ్ల ప్రారంభం, వ్యవసాయ పనులు ప్రారంభం నేపథ్యంలో ఫీజులు, పుస్తకాలు, యూనిఫారం, బ్యాగులు ఇతర సామగ్రి కొనుగోళ్లతో తల్లిదండ్రులకు చుక్కలు కనపడతాయి. మరోపక్క ఖరీఫ్ సీజన్‌లో పత్తి, విత్తనాలు, ఎరువులు, కూలీలకు ఇచ్చేందుకు కూడా పెట్టుబడి పెట్టాల్సిందే. ఆపై నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలతో దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. ఒక్కో కుటుంబానికి ఈ నెలలో సుమారు రూ.లక్షకుపైనే ఖర్చు వచ్చి పడుతుంది. చాలీచాలని వేతనాలతో, పైసాపైసా కూడబెట్టుకునే సామాన్యులు ఈనెల గడిచేదెలా అంటూ ఆందోళన చెందుతున్నారు. ఏటికేడు పెరుగుతున్న పాఠశాలు, కళాశాల ఫీజులు, అందుకయ్యే ఖర్చు తలచుకుంటేనే వారి గుండె గుభేల్‌మంటోంది. నెలవారీ జీతాలపైనే ఆధారపడి జీవితాలను నెట్టుకొచ్చే మధ్యతరగతి కుటుంబాలు సతమతమవుతున్నాయి. ముఖ్యంగా ప్రయివేట్ పాఠశాల యాజమాన్యాలు ఫీజులు, డొనేషన్లు, బస్సు చార్జీలు, యూనిఫారం, పుస్తకాల రూపంలో విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద నుంచి భారీగా వసూలు చేస్తున్నారు. పైగా ఇతర సామగ్రి ధరలు పెరిగిపోయాయి. కొన్ని కార్పొరేట్ పాఠశాలల్లో ఆరు నుంచి పదో తరగతి పిల్లల పుస్తకాలకు రూ.25 వేల వరకు వసూలు చేస్తున్నారు. తాము ఎలా ఉన్నా, తమ పిల్లల భవిష్యత్తు బంగారంలా ఉండాలని భావిస్తూ తల్లిదండ్రులు భారంగానే పుస్తకాలు కొంటున్న పరిస్థితి. ఇదే సమయంలో ఇతర ఖర్చులు పెరిగిపోయాయి. విద్యుత్ బిల్లుల నుంచి నిత్యావసరాలు, కూరగాయల ధరలు చుక్కలు చూపెడుతున్నాయి.

భారీగా డొనేషన్లు

పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇంటింటి ప్రచారాలకు తెరలేపాయి. తల్లిదండ్రులను ఆకట్టుకునేందుకు వివిధ మార్గాలను ఎంచుకుంటున్నాయి. ఆకర్షణీయంగా కరపత్రాలు పంచుతూ క్యాంపెయిన్ ముమ్మరం చేశాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను ఏ పాఠశాలలో చేర్పించాలనే ఆలోచనలో పడ్డారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉండేవారు దగ్గరి పట్టణాల్లోని పాఠశాలలను ఎంచుకునే ప్రయత్నంలో నిమగ్నం కాగా, అక్కడ డొనేషన్లు, ఫీజుల మోత విని భయపడుతున్నారు. యుకెజి, ఎల్‌కెజి స్థాయిలోనే రూ.వేలకు వేలు ఫీజులు చెబుతుండడంతో వెనక్కి తగ్గుతున్న పరిస్థితి.

పెన్సిల్ నుంచి పుస్తకాల వరకు మోతే

పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్నాయంటే తల్లిదండ్రులకు గుర్తొచ్చేది ఫీజులు, పుస్తకాలే. ముఖ్యంగా పాఠశాలలో అడుగు పెట్టాలంటే పుస్తకాలు, నోట్ పుస్తకాలతోపాటు వాటిని భద్రపరచుకునేందుకు భారీ బ్యాగులు, దానికి తోడు లంచ్ బాక్స్, పెన్ను, పెన్సిల్.. ఇలా ఒకటేమిటి రకరకాల వస్తువులు కొనుగోలు తప్పనిసరి. గతంలో విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు తమకిష్టమొచ్చిన దుకాణంలో కొనుక్కునేవారు. ఇప్పుడు ప్రయివేట్ పాఠశాలల పంథా మారింది. పుస్తకాలు, బెల్టు, టై, యూనిఫారం అన్నీ ఆయా పాఠశాలల్లోనే కొనాల్సిన పరిస్థితి. పాఠశాలల యాజమాన్యాలు చెప్పిన ధర చెల్లించలేక తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. ఒకవైపు ఆర్థికభారం.. మరోవైపు పిల్లాడి భవిష్యత్తు కోసం మౌనంగానే ముందడుగు వేస్తున్నారు. అడ్మిషన్ నుంచి తరగతి గదిలో అడుగు పెట్టేంత వరకు తల్లిదండ్రులకు కంటిమీద కునుకు కరువైపోతుందని వాపోతున్నారు.

ఒక్కో కుటుంబంపై రూ.లక్షల్లో భారం

ఒకవైపు నిత్యావసర సరుకులు, వివిధ ఖర్చులు అడ్డగోలుగా పెరిగిపోయాయి. ఏ నెలకానెల ఆదాయ, వ్యయాలపై ఆచితూచి అడుగులు వేస్తున్న వారిలో వేతన జీవులు, చిరు వ్యాపారులు, రోజువారీ కూలీలు ఉన్నారు. విద్య విషయంలో పెరిగిన అవగాహన నేపథ్యంలో అందరూ పిల్లలను ఉన్నతంగా చదివించాలనే తలంపుతో ఉన్నారు. ఈ నేపథ్యంలో సాధారణ రోజుల్లోనే నగరంలోని ఒక చిన్న కుటుంబం ఇంటి అవసరాలకు రూ.25 నుంచి రూ.30వేల వరకు ఖర్చవుతుండగా, ఈ నెలలో ఇంటి అవసరాలు పక్కనపెడితే కేవలం పిల్లల పాఠశాలల కోసం ఒక్కొక్కరికీ రూ.50వేల వరకు ఖర్చుచేయాల్సి వస్తుంది. ఇంట్లో ఇద్దరు పిల్లలు ఉంటే ఇక అంతే.. జూన్‌లో రూ.లక్షకు పైనే ఖర్చు అని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఇకపోతే పదో తరగతి పాసయిన విద్యార్థుల ఇళ్లలో అంతకు రెట్టింపు ఆందోళన ఉంది. ఇంటర్ ఏ కళాశాలలో చేర్చాలి.. డే స్కాలర్‌నా, హాస్టల్లోనా.. అనే ఆలోచనతోపాటు, ఆయా కళాశాలల గుర్తింపును బట్టి విద్యార్థికి అక్షరాల రూ.లక్షపైనే ఖర్చవుతోంది. మరోవైపు సర్కారు మూడు రెట్లు విద్యుత్ బిల్లుల మోత మోగించడంతో సామాన్యుడి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇంకోవైపు పెరిగిన నిత్యావసర సరకుల ధరలు, కూరగాయల ధరల పెరుగుదలతో పేద, మధ్య తరగతి కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి. జూన్ మాసం పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ఓ వణుకు పుట్టిస్తోంది.

మరోపక్క వ్యవసాయం భారమే

జూన్ నెలలో విద్యను కొనాల్సిన పరిస్థితి ఉంది. మరోపక్క వ్యవసాయం పనుల్లో పెట్టుబడి పెట్టాల్సిందే. ఒక ఎకరాకు రూ.30 నుంచి రూ.50 వేల వరకు ఖర్చు పెట్టాల్సిందే. అతివృష్టి, అనావృష్టి కారణాల వల్ల పెట్టుబడి పెట్టినా చేతికి రాక అప్పుల పాలవక తప్పదు. మరో వైపు నకిలీ విత్తనాల బెడద వెంటాడుతోంది. జూన్ నెల అంటేనే రెండు పక్కల ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి.

చిన్నన్న

మంగమ్మ

గెలుపులపై పందేలు

ప్రజాశక్తి - మంత్రాలయం/కోసిగి

నియోజకవర్గంలో టిడిపి, వైసిపి అభ్యర్థుల గెలుపుపై పలువురు పందెం కాస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేగా టిడిపి అభ్యర్థి ఎన్.రాఘవేంద్ర రెడ్డి గెలుస్తారని, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవుతారని మడ్రి చిన్నన్న రెండెకరాల భూమిని పందెం కాశారు. ఎమ్మెల్యేగా వై.బాలనాగిరెడ్డి గెలుస్తారని, జగన్మోహన్ రెడ్డి మంత్రి వర్గంలో మంత్రి అవుతారని శుక్రవారం కోసిగి జడ్‌పిటిసి సభ్యులు మంగమ్మ పందెం కాశారు. ఇందుకు ఎవరికైనా సందేహం ఉంటే రూ.20 లక్షల పందెం కాస్తామని, శనివారం ఉదయం 10 గంటలకు ఎల్లమ్మ గుడి వద్దకు రావాలని సవాలు విసిరారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ సృష్టించడంతో చిన్నన్న కూడా సోషల్ మీడియా ద్వారా స్పందించారు. మండలంలోని వగరూరు గ్రామానికి చెందిన మడ్రి చిన్నన్న, మంగమ్మ సవాలకు స్పందించి తన రెండెకరాల భూమి రూ.50 లక్షల విలువ ఉంటుందని, రూ.20 లక్షలు పందెం కాశారని, సవాలును స్వీకరిస్తున్నట్లు సోషల్ మీడియా ద్వారా తెలిపారు.

డ్రైవర్‌పై డిప్యూటీ డిఎంహెచ్ఒ విచారణ

- ప్రభుత్వ సొమ్మును తిరిగి చెల్లించాలి
- ఎఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు డిమాండ్

ప్రజాశక్తి - మంత్రాలయం

'అటెండెన్స్ ఒక చోట.. విధులు ఒక చోట' అంటూ డిప్యూటీ తహశీల్దార్ రాఘవేంద్రకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో శుక్రవారం డిప్యూటీ డిఎంహెచ్ఒ సత్యవతి విచారణ చేపట్టారు. విధులకు హాజరు కాకుండా జీతం తీసుకున్న డ్రైవర్ మహబూబ్ బాషా ప్రభుత్వానికి తిరిగి చెల్లించాలని, లేకపోతే ఉద్యమాలు చేపడతామని ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి థామస్, పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ నాయుడు హెచ్చరించారు. మండలంలోని కల్లుదేవకుంట గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న మహబూబ్ బాషా పదేళ్లుగా విధులకు హాజరుకాకుండా ప్రభుత్వ జీతం తీసుకుంటూ ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రయివేట్ నర్సింగ్ హోమ్‌లో విధులు నిర్వహిస్తున్నారని, చర్యలు తీసుకోవాల ని నాయకులు కోరారు. ఈ విషయంపై స్పందించిన ఆమె మాట్లాడుతూ... తప్పును ఒప్పుకొని ఇప్పటి నుంచి విధులకు హాజరు అవతానని మహబూబ్ బాషా తెలిపారని అన్నారు. జరిగిన తప్పునకు మెమోను జారీ చేసినట్లు పేర్కొన్నారు. నాయకులు నారాయణ, చిన్న, రాజు, రంగన్న పాల్గొన్నారు.

విచారణ చేపడుతున్న అధికారులు

గోనెగండ్ల చేరుకున్న పాఠ్యపుస్తకాలు

- పాఠశాలల ప్రారంభానికి ముందే అందించేందుకు తగిన చర్యలు
- ఎంఇఒ-1 రామాంజనేయులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని విద్యార్థులకు ఉచితంగా అందజేయడానికి ప్రభుత్వం నుంచి పాఠ్యపుస్తకాలు మండల కేంద్రానికి చేరుకుంటున్నట్లు ఎంఇఒ-1 రామాంజనేయులు శుక్రవారం తెలిపారు. గోనెగండ్ల మండలంలో 39 ప్రాథమిక, 4 ప్రాథమికోన్నత, 8 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఎపి మోడల్, కెజిబివి పాఠశాలతో కలుపుకొని మొత్తం 53 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. 1 నుంచి 10వ తరగతి వరకు మొత్తం 10,436 విద్యార్థులు ఉన్నారు. వీరిలో 1, 2వ తరగతి విద్యార్థులకు పూర్తిస్థాయిలో నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు చేరుకున్నాయి. మిగతా ఉన్నత తరగతులకు కూడా అవసరమైన మేర నోట్ పుస్తకాలు వచ్చాయని, పాఠ్యపుస్తకాలు కూడా కొన్ని టైటిల్స్ అందాయని, ఇప్పటిదాకా 25 శాతం పుస్తకాలు వచ్చి చేరాయని, 4, 5 రోజుల్లో పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు అందనున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. వచ్చిన పుస్తకాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్టోర్ చేశారు. మిగతా పాఠ్యపుస్తకాలు వాటితో పాటు విద్యా కానుక కిట్లు అందిన తర్వాత పాఠశాలల ప్రారంభానికి ముందే పాఠ్యపుస్తకాలు, విద్యా కానుక కిట్లను పంపిణీ చేసే విధంగా జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు.

చేరుకున్న పాఠ్యపుస్తకాలు

పంపిణీకి చర్యలు

- ఎంఇఒ-1 రామాంజనేయులు

పాఠ్యపుస్తకాలు మండల కేంద్రానికి దశలవారీగా వచ్చి చేరుతున్నాయి. వచ్చిన వాటిని తరగతుల వారీగా విభజించి సిద్ధంగా ఉంచుకుంటున్నాం. త్వరలోనే పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు, విద్యా కానుక కిట్లు అందే అవకాశం ఉంది. పూర్తిస్థాయిలో అందిన తర్వాత పాఠశాలల ప్రారంభానికి ముందే జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు పంపిణీ చేసేందుకు తగిన చర్యలు చేపడతాం.

ఎఐఆర్‌ఒలను నమ్మి మోసపోయాను

- మాజీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళీ

ప్రజాశక్తి - మంత్రాలయం

విధి నిర్వహణలో ఎఐఆర్ఒలను నమ్మి మోసపోయానని మాజీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.మురళీ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘం ఆయనపై సస్పెన్షన్ వేటు వేసిందని వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం ప్రజాశక్తి ఆయనను ఫోన్ ద్వారా పలుకరించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని కోసిగి, కౌతాళం, పెద్దకడబూరు మండలాల తహశీల్దార్లు సహకరించడంలో నిర్లక్ష్యం చూపారని పేర్కొన్నారు. అప్పుడే వారికి షోకాజు నోటీసులు జారీ చేయాల్సిం దని తెలిపారు. తాను బాధ్యతతో, సమర్థవంతంగా పోలీసు అధికారుల సమన్వయం తో ఎన్నికలు ప్రశాంతంగా జరిపించామని చెప్పారు. జిల్లాలోనే అత్యధికంగా ఓటింగ్ శాతం నమోదయిందని తెలిపారు. ఓటింగ్ పూర్తి కాగానే ఇవిఎంలను బస్సుల ద్వారా జిల్లా కేంద్రానికి తరలించేసరికి అర్ధ రాత్రి దాటిందని చెప్పారు. రికార్డులను కలెక్టర్‌కు సమర్పించేందుకు కింది నుంచి పైకి వెళ్లే సరికి ఆలస్యమైందని, ఇది ముమ్మాటికి తన తప్పు కాదని ఎఐఆర్ఒల తప్పిదమని పేర్కొన్నారు. ఎఐఆర్ఒల విధుల పట్ల ఉదాసీనత కారణంగా తనపై బదిలీ వేటు పడిందని, తన సమర్థతను నమ్ముకుని ఉంటే ఈ మచ్చ పడి ఉండేది కాదని తెలిపారు.

బాలనాగిరెడ్డి గెలవాలని
నాగపట్నంలో ప్రార్థనలు

ప్రజాశక్తి - కోసిగి

వైసిపి మంత్రాలయం ఎమ్మెల్యే అభ్యర్థి బాలనాగిరెడ్డి భారీ మెజార్టీతో గెలిచి మంత్రి పదవి అలంకరించాలని కోసిగిలోని 3వ వార్డుకు చెందిన వైసిపి నాయకుడు, బాలనాగిరెడ్డి అభిమాని పందికోన నాగేష్ తమిళనాడులోని నాగపట్నంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వారంరోజుల క్రితం కుటుంబ సమేతంగా నాగపట్నం చేరుకొని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి నాలుగోసారి భారీ మెజార్టీతో గెలుపొంది నియోజకవర్గంలో చరిత్ర సృష్టించాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్లు ఆయన శుక్రవారం తెలిపారు.

విత్తనాలు, ఎరువులు పూర్తిస్థాయిలో సరఫరా చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్
- మండల వ్యాప్తంగా ఆర్‌బికెల దగ్గర రైతుసంఘం నిరసనలు

ప్రజాశక్తి -దేవనకొండ

రైతులకు పూర్తిస్థాయిలో విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్ డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్ ముంచుకొస్తున్నా వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు, ఎరువులను సమకూర్చడంలో ప్రభుత్వం తగిన కృషి చేయడం లేదని చెప్పారు. అన్ని రకాల పంటలకు సంబంధించిన విత్తనాలను వెంటనే ఆర్‌బికెల ద్వారా రైతులకు పూర్తిస్థాయిలో అందించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల రైతులకు ఎరువులు, విత్తనాలు వెంటనే పంపిణీ చేయాలని మండలంలోని దేవనకొండ, పల్లెదొడ్డి, కుంకునూరు, తెర్నేకల్లు, కోటకొండ, నెల్లిబండ, కప్పట్రాళ్ల, జిల్లెడుబుడకల, చెలిమిచెలిమల గ్రామాల్లో రైతుసంఘం ఆధ్వర్యంలో నిరసనలు వ్యక్తం చేసి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లెడు బుడకల గ్రామంలో జరిగిన నిరసనలో సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ సంఘీభావంగా పాల్గొని మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో కేవలం వేరుశనగ విత్తనాలు పంపిణీ చేసి ప్రభుత్వం చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. పత్తి, కంది, సజ్జ, జొన్న వంటి ఇతర పంటల విత్తనాలను కూడా ప్రభుత్వం వెంటనే ఆర్‌బికెల ద్వారా సబ్సిడీపై పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా పశ్చిమ ప్రాంతంలో పత్తి పంటను రైతుల ఎక్కువ సంఖ్యలో సాగు చేస్తారని తెలిపారు. పత్తి విత్తనాలను రైతులకు సబ్సిడీపై ఇవ్వాలని కోరారు. మార్కెట్‌లో పత్తి విత్తనాల కల్తీ విపరీతంగా జరిగి జిల్లాలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. గత అనుభవాల దృష్ట్యా రైతులకు నష్టం జరగకుండా పత్తి విత్తనాల పంపిణీకి ప్రభుత్వం యుద్ధ ప్రతిపాదికన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో, మారుమూల గ్రామాల్లో ఎరువులు తీసుకోవడం వ్యయ ప్రయాసాలతో కూడిన పని అని తెలిపారు. ఎక్కడికక్కడ ఆర్‌బికె ద్వారా రైతులకు ఎరువులు సమకూర్చాలని డిమాండ్ చేశారు. రైతుసంఘం మండల కార్యదర్శి సూరి, సిఐటియు మండల కార్యదర్శి అశోక్, మండల కార్యదర్శి మహబూబ్ బాషా, రైతు సంఘం నాయకులు శ్రీరాములు, లింగన్న, లక్ష్మిరెడ్డి, కెపి.రాముడు, బలరాముడు, బండ్లయ్య, మహేష్, వీరేంద్ర, వీరన్న, శ్రీనివాసులు, కౌలుట్ల, సుంకన్న పాల్గొన్నారు.

దేవనకొండలో వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలి

- సర్పంచి పాల్ దినకరన్

ప్రజాశక్తి - కౌతాళం

ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనేదే ప్రభుత్వ లక్ష్యమని కౌతాళం సర్పంచి పాల్ దినకరన్ పేర్కొన్నారు. శుక్రవారం గ్రామ సచివాలయం-3 పరిధిలో ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ డాక్టర్ పావని ఆధ్వర్యంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం అనేక మంది వైద్యం కోసం అప్పులు చేస్తున్నారని చెప్పా రు. ఇలాంటి పరిస్థితుల నుంచి ప్రజలకు రక్షించాల ని 'ఆరోగ్య సురక్ష' చేపడుతున్నట్లు తెలిపారు. డాక్టర్ పావని మాట్లాడుతూ... వైద్యుల సూచనలు, సలహాలు పాటించి ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఆరోగ్య పరంగా సమస్యలు వచ్చినప్పుడు ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులను ఆశ్రయించాలన్నారు. మండల పరిషత్ ఎఒ సత్యన్న, పంచాయతీ కార్యదర్శి బి.శివప్ప, సచివాలయ ఎఎన్ఎంలు, వివిధ విభాగాలకు చెందిన డాక్టర్లు, నర్సులు, ఆయాలు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సర్పంచి పాల్ దినకరన్

'అప్రెంటీస్'ను సద్వినియోగం చేసుకోవాలి

- ఆదోని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి - ఆదోని

అప్రెంటీస్ షిప్‌ను నర్సింగ్ విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉద్యోగావకాశాలు పొందాలని ఆదోని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసులు సూచించారు. నోబుల్ ఒకేషనల్ జూనియర్ కళాశాల నుంచి ఆస్పత్రిలో మొదటి బ్యాచి కింద అప్రెంటీస్ షిప్‌కు ఎంపికయ్యారు. కళాశాలలో ఎంపికైన విద్యార్థులు, అధ్యాపకులను అభినందించి సన్మానించారు. శుక్రవారం కళాశాల కరస్పాండెంట్ సంగటి దేవదానం ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసులును పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా దేవదానం మాట్లాడారు. ఆదోనిలో ప్రారంభించిన ప్రభుత్వాస్పత్రిలో మొదటి బ్యాచిలోనే అప్రెంటీస్ షిప్‌కు నోబుల్ ఒకేషనల్ విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపిహెచ్ బాలికల నర్సింగ్‌లో 58 మంది, ఎంఎల్‌టి 39 మంది విద్యార్థుల సర్టిఫికెట్లను సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసులు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో వెరిఫికేషన్ చేసినట్లు చెప్పారు. నర్సింగ్ కోర్సులు పూర్తి చేసిన వారు అప్రెంటీస్ షిప్ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ సమయంలో అంకితభావంతో విధులు నిర్వర్తించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. నోబుల్ ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపల్ హెచ్‌పి.అబ్దుల్ బాష, డాక్టర్ సలోమి, దివాకర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సూచనలు చేస్తున్న వైద్యులు

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

ప్రజాశక్తి - ఆదోని

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించి ప్రమాదాలు జరగకుండా పటిష్ట భద్రత చర్యలు చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ ఆదేశించారు. శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో డివిజన్ స్థాయి రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో రోడ్ సేఫ్టీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల గురించి ఆరా తీశారు. పట్టణంలో కొత్త బ్రిడ్జిలో ఏర్పడిన గుంతలను పూడ్చి మరమ్మతులను పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బి అధికారులను ఆదేశించారు. కొత్తబస్టాండ్ సమీపంలో రోడ్డుపై పశువులు ఎక్కువగా ఉండడం వల్ల వాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. పశువులను తీసుకెళ్లాలని, లేకపోతే గోశాలకు తరలిస్తామని సబ్ కలెక్టర్ తెలిపారు. పెద్ద మార్కెట్ ఏరియాలో పార్కింగ్ సమస్య ఎక్కువగా ఉందని, వాటిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. మెయిన్ రోడ్డుపై పార్కింగ్ చేస్తున్న వాహనాలకు జరిమానాలు వేయాలని ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. మెయిన్ రోడ్లపై నిబంధనలకు విరుద్ధంగా ఏదైనా కట్టడాలు జరిగితే విచారణ చేసి తొలగించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మెయిన్ రోడ్లపై గుంతలు ఉంటే వాటిని పూడ్చి, మరమ్మతులు చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలన్నారు. ఓవర్ లోడ్, ఓవర్ స్పీడ్ వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. స్కూల్ ఆటోలో ఎక్కువ సంఖ్యలో ప్రయాణిస్తుంటే వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే చోట బ్లాక్ స్పాట్‌గా గుర్తించి అక్కడ నేమ్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఆ ప్రదేశంలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమస్య లేకుండా చూడాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్‌టిఒ నాగేంద్ర, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శిశిర దీప్తి, రోడ్లు భవనాలు శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకట ప్రసాద్, ఆర్‌టిసి డిపో మేనేజర్ మహ్మద్ రఫీ, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, ట్రాఫిక్ సిఐ మంజునాథ్ పాల్గొన్నారు.

భక్త యోగాంజనేయ స్వామి ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి- దేవనకొండ

పూజలు చేస్తున్న పురోహితులు

మండలంలోని పి.కోటకొండ గ్రామంలో కొలువైన శ్రీభక్త యోగాంజనేయ స్వామి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆలయ వ్యవస్థాపకులు యోగేశ్వరరావు, ఆలయ కమిటీ ఛైర్మన్ హనుమంతు రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారికి పంచామృతాభిషేకాలు, కలశ స్థాపన, పూజలు నిర్వహించారు. మహిళలు స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు ఉత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శనివారం రథోత్సవం నిర్వహిస్తున్నట్లు, భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.